సిద్దిపేటలో ఎంపీటీసీ, జడ్పీటీసీల సన్మాన కార్యక్రమంలో హరీశ్‌రావు

కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయాలు

- పాలనను గాలికొదిలేసిన సర్కార్
- రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నరు
- వేతనాలివ్వలేని దుస్థితిలో సర్కారు
- 7 నెలల్లోనే ప్రభుత్వంపై వ్యతిరేకత
- మాజీమంత్రి హరీశ్ విమర్శలు

దుబ్బాక/సిద్దిపేట, జూలై 3: ప్రజాపాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా సిద్దిపేట, దుబ్బాకలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐదేండ్ల పదవీకాలం ముగిసినందుకు ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రతిపక్షాలపై కుట్రపూరితంగా కేసులు పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా ఆగమైందని పేర్కొన్నారు. హత్యలు, లైంగికదాడులు, ఆత్మహత్యలు పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఖమ్మం జిల్లాలో ఓ రైతు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో మరో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టకపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేని దౌర్భాగ్యస్థితిలో ప్రభుత్వం ఉన్నదని విమర్శించారు. కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా లక్ష రూపాయలతోపాటు తులం బంగారం కూడా ఇస్తామన్నారని, ఇప్పుడు బంగారం కాదు కదా, ఇచ్చే రూ. లక్ష కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఆసరా పింఛన్లకు కోత పెట్టారని, కరెంటు కోతలతో బోరు మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కరెంటు పోతే విద్యుత్తు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌కు పాలన చేతకావడం లేదని ఎద్దేవా చేశారు.

ఆంధ్రాలో 4వేలు పింఛన్ ఇస్తున్నరు

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నెలకు రూ. 4 వేల పింఛన్ ఇచ్చిందని, ఇక్కడ మాత్రం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా కొత్త పెన్షన్ ఇవ్వకపోగా, పాత పింఛన్‌లో కోతపెట్టారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో కాలంతో పనిలేకుండా రైతులు పంటలు పండించారని, ఇప్పుడు సిద్దిపేట జిల్లాలో మూడుశాతం వరినాట్లు మాత్రమే వేశారని అధికారులు చెప్తున్నారని తెలిపారు.

వచ్చేది బీఆర్‌ఎస్ సర్కారే

ఏడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ప్రజావ్యతిరేక ఏర్పడిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల్లో పచ్చని చెట్లు స్వాగతం పలికితే, నేడు చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని విమర్శించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ సర్కారేనని ధీమా వ్యక్తంచేశారు. ప్రజలు తిరిగి బీఆర్‌ఎస్‌ను కోరుకుంటున్నారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బుధవారం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో మహబూబాబాద్, మేడ్చల్, నల్లగొండ జిల్లాల ప్రజా ప్రతినిధులతో సమావేశం సందర్భంగా మాట్లాడుతున్న కేసీఆర్

తెర్లయిపోతున్న తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

వెల్లడించారు. ఆ పార్టీకి ఓటేసి పొరపాటు చేశామని ప్రజలు నాలుక కరుసుకుంటున్నారని చెప్పారు. కొత్తవి అమలుచేయడం అటుంచి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలనూ ఎగ్గొడుతూ మోసం చేస్తున్న సర్కారు నిజస్వరూపాన్ని ప్రజలు గ్రహిస్తున్నారని అన్నారు. బుధవారం ఎర్రవల్లి నివాసంలో మహబూబాబాద్, మేడ్చల్, నల్లగొండ జిల్లాల నుండి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ అస్తిత్వమే ప్రమాదంలో పడిన.. దిక్కుమొక్కులేని చివరిదశ ఉద్యమకాలం నుంచి.. తెలంగాణ రాష్ట్ర సాధన, పదేండ్ల ప్రగతి పాలన దాకా తాను ఎదుర్కొన్న కష్టాలను కార్యకర్తలకు వివరించారు. ఆనాడు తెలంగాణను అష్టదిగ్బంధం చేసిన సమైక్యవాద శక్తులు, వారి మీడియాతో సహా సమస్త రంగాలు.. రాసిందే రాత, గీసిందే గీత'గా నడిచేదని గుర్తుచేశారు. అత్యంత శక్తివంతమైన ఆంధ్రా వ్యవస్థలను తట్టుకుంటూ, తెలంగాణ వ్యతిరేకతకు, సమైక్యవాదానికి సింబాలిక్‌గా

కేసీఆర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కార్యకర్తలు, అభిమానులు

ఉన్న చంద్రబాబును ఎదిరించి నిలవటం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని తెలిపారు. అలాంటి సమైక్యవాద కుటిల వ్యవస్థలనే బద్దలుకొట్టి, కలబడి నిలబడిన తెలంగాణ సమాజం భవిష్యత్తులో ఎలాంటి ప్రతిబంధక పరిస్థితులనైనా అధిగమిస్తుందని భరోసా కల్పించారు. గెలుపు ఓటములకు అతీతంగా తెలంగాణ సమాజం మనకు ఎల్లవేళలా అండగా ఉన్నదని, భవిష్యత్తులోనూ ఉంటుందని అన్నారు. 'రాజకీయ జీవితంలో ప్రజలు ఎటువంటి బాధ్యతను అప్పగించినా నిర్వర్తించడమే కార్యకర్తలు, నాయకుల లక్షణం. అధికారముంటేనే పనిచేస్తామంటే రాజకీయ నాయకుల జీవితం గుడ్డెద్దు చేన్ల పడ్డ చందంగా తయారవుతుంది' అని వెల్లడించారు.

పేరుపేరునా ధన్యవాదాలు

'నన్ను కలుద్దానికి పిలిచినోళ్లు, పిలవనోళ్లు రోజూ వేలమంది వస్తున్నరు. మీ అభిమానానికి థాంక్స్. అయితే అంతమందికి ఐదారు గంటలపాటు నిలబడి ఫొటోలు దిగాల్నంటే కాలిరిగిన నాకూ ఇబ్బందే అయితున్నది. ఒక్క మనిషి వేలమందితో నిలబడి ఫొటోలు దిగితే ఎంత కష్టమో మీరే చెప్పండి. అందుకే సందర్శకులను ముందస్తు సమాచారం మేరకే ఆహ్వానించాలనుకున్నాం. వారానికి రెండు నియోజకవర్గాల పేర్లు చెప్తం. చెప్పినవాళ్లు మాత్రమే వస్తే లొల్లి లేకుంట వాళ్లతో కడుపు నిండ మాట్లాడుకొని పంపియ్యొచ్చు. మీరు నా మీద ఇంతగా చూపిస్తున్న అభిమానానికి మరోసారి పేరుపేరునా ధన్యవాదాలు' అని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. తనను కలిసేందుకు ముందస్తు సమాచారంతో మాత్రమే రావాలని మరోసారి విన్నవించారు. సమావేశంలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కోటిరెడ్డి, గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, జీవన్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీతారెడ్డి, నలమోతు భాస్కర్‌రావు, రమావత్ రవీంద్రకుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్, బూడిద భిక్షమయ్య గౌడ్, కంచర్ల కృష్ణారెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటమితో దిష్టి తీసినట్టయ్యింది

శత్రువులు, ప్రత్యర్థుల కుటిల యత్నాలను అధిగమిస్తూ అప్రతిహతంగా కొనసాగుతున్న బీఆర్‌ఎస్ విజయ ప్రస్థానంలో ఓటమితో దిష్టి పోయిందని, తిరిగి పునరుత్తేజంతో ప్రజాదరణను కూడగట్టాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. రెండున్నర దశాబ్దాల బీఆర్‌ఎస్ ప్రస్థానంలో ప్రతి అడుగులో అద్భుతమైన విజయగాథలే తప్ప అపజయ గాథలు లేవని, తెలంగాణ సాధన కోసం బయలుదేరిన నాటి వ్యతిరేక పరిస్థితులనే తట్టుకుని నిలబడ్డ పార్టీకి.. నేటి పరిస్థితులు ఒక లెక్కే కాదని, ఎటువంటి ఆటంకాలనైనా అలవోకగా దాటుకుంటూ ప్రజాదరణను సాధిస్తూ ముందడుగు వేస్తుందని పునరుద్ఘాటించారు. 'మరికొద్ది రోజుల్లోనే టార్చ్‌లైట్ పట్టుకొని జనం దేవులాడుకుంటూ బీఆర్‌ఎస్ పార్టీ కోసం వస్తారు. ప్రశాంతమైన పాలన ద్వారా పదేండ్లపాటు సంక్షేమం, అభివృద్ధిని అందిస్తూ అండగా నిలబడ్డ బీఆర్‌ఎస్‌ను తిరిగి తెలంగాణ సమాజం కోరుకుంటున్నది' అని వెల్లడించారు. అప్పటిదాకా ఓపికతో ప్రజా సమస్యలపై పోరాడుతూ, వారికి అందుబాటులో ఉండాలని కార్యకర్తలకు సూచించారు.

ఫిరాయింపుల కేసుల విచారణ 8కి వాయిదా

హైదరాబాద్, జూలై3 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోపై గెలుపొందిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్‌ఎస్ నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ ఈ నెల 8కి వాయిదా పడింది. ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్ వేసిన వేర్వేరు పిటిషన్లు బుధవారం జస్టిస్ బీ విజయసేన్‌రెడ్డి విచారణ చేసే కేసుల జాబితాలో చేర్చారు. అయితే అనర్హత పిటిషన్లపై విచారణను వాయిదా వేయాలని ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కోరడంతో విచారణ సోమవారానికి వాయిదా పడింది. బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన ఖైరతాబాద్, భద్రాచలం, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని తీవ్రంగా పరిగణించాలని, ఆ ముగ్గురూ ఎమ్మెల్యేలుగా అనర్హులుగా ప్రకటించేలా స్పీకర్‌కు ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్లు కోరుతున్నారు.



రాష్ట్రాలకే ఫోన్ ట్యాపింగ్ అధికారం

హైకోర్టుకు నివేదించిన కేంద్రం

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ) : ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉందని కేంద్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఇది పూర్తిగా రాష్ట్రాల పరిధిలోని అంశమని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఫోన్ల ట్యాపింగ్ జరిగిందని, హైకోర్టు న్యాయమూర్తి ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందంటూ పత్రికల్లో వచ్చిన వార్తలను హైకోర్టు సుమోటో పిటిషన్‌గా పరిగణించింది. దీనిపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఆ కాపీ ప్రతి కోర్టు ఫైల్‌లో లేకపోవడంతో విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది.

బీసీల సమస్యలపై సమరశీల పోరాటం

- ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

కాచిగూడ, జూలై 3 : బీసీల సమస్యలు పరిష్కరించకుంటే కేంద్ర ప్రభుత్వంపై సమరశీల పోరాటం చేస్తామని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. అహింసా మార్గంలో కేసీఆర్ చేసిన తెలంగాణ ఉద్యమాన్ని చూసి సోనియాగాంధీ భయపడి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఇదే మార్గంలో బీసీలమంతా ఏకమై తమ సమస్యలపై మోదీ ప్రభుత్వాన్ని నిలదీస్తామని, వేలాది మందితో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇదేనా ప్రజా పాలన?

- ప్రశ్నించే ఎమ్మెల్యేలపై కేసులు పెట్టడమేనా?
- ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధికే నిరసన తెలిపే హక్కు లేదా?
- ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో అక్రమ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు సరైన గౌరవం, ప్రొటోకాల్ ఇవ్వకుండా అడ్డగోలుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకుల వైఖరిపై నిరసన తెలిపినందుకు ఎమ్మెల్యేపైనే పోలీసులు ఏకపక్షంగా కేసు నమోదు చేయటం అక్రమమని బుధవారం 'ఎక్స్'లో మండిపడ్డారు. పోటీ నిరసన కార్యక్రమాలు చేపట్టిన కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకు ప్రతిపక్షాలను బెదిరించే ఉద్దేశంతోనే ఇలాంటి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజాపాలన అంటే ప్రశ్నించే ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టడమేనా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. 'ప్రజా సమస్యలను

జడ్పీ సమావేశం దృష్టికి తీసుకురావటమే కౌశిక్‌రెడ్డి చేసిన నేరమా? నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అందుతున్న విద్య, సౌకర్యాలు, తరగతి గదుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వసతుల కల్పనపై మండల విద్యాధికారితో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించటం తప్పా? ఈ సమావేశానికి ఎందుకు హాజరయ్యారంటూ మండల విద్యాధికారులకు డీఈవో అక్రమంగా నోటీసులు ఇవ్వటమేమిటి? డీఈవో కాంగ్రెస్ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని కౌశిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ, జడ్పీ సమావేశంలో లేవనెత్తారు. స్థానిక ఎమ్మెల్యేగా తనకున్న అధికారాల మేరకు సమావేశం నిర్వహించటానికీ కౌశిక్‌రెడ్డికి హక్కు లేదా? జడ్పీ సమావేశంలో కలెక్టర్ పట్టించుకోకపోవటంతో నిరసన తెలిపే ప్రయత్నం చేశారు. ప్రజాస్వామ్యంలో ఒక ప్రజాప్రతినిధికే నిరసన తెలిపే హక్కు లేదా?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రతిపక్షాల నోరు మూయించాలనే కుట్రతో అక్రమ కేసులకు తెరతీస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే ఈ కేసు పెట్టారని ఆరోపించారు. కౌశిక్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించటం దుర్మార్గపూరిత చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హుజురాబాద్ ఎమ్మెల్యేగా కౌశిక్‌రెడ్డి ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్నారని, ప్రభుత్వ పెద్దల అవినీతి, అక్రమాలను బయటికి తీస్తున్నందుకే కేసుల ద్వారా ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ పాలన, ప్రజాపాలన అంటే ఇదేనా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. బీఆర్‌ఎస్ ప్రజాగొంతుకగా ఉంటుందని స్పష్టంచేశారు. అక్రమ కేసులను చట్టపరంగా ఎదుర్కొంటామని తేల్చిచెప్పారు.

సమస్యలపై సమీక్ష నిర్వహించే అధికారం లేదా?: సబితాఇంద్రారెడ్డి

ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోవడమే నేరమా? అని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి ప్రశ్నించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు తమ నియోజకవర్గంలోని సమస్యలపై సమీక్ష నిర్వహించే అధికారం లేదా? అని నిలదీశారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై అక్రమ కేసును బనాయించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. 'ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోయినా స్పందించకపోవటంతో.. నిరసన వ్యక్తం చేసే హక్కు శాసనసభ్యులకు లేదా? ప్రశ్నిస్తే కేసులు పెడతారా? ముఖ్యమంత్రీ.. ఇదెక్కడి ప్రజాస్వామ్యం? అక్రమ కేసులతో ప్రతిపక్షాల నోరును మూసేయించేందుకు జరుగుతున్న కుట్రను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?: హరీశ్

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసులు అక్రమకేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించినందుకు గిరిజన మహిళా ఎమ్మెల్యేపై కేసులు పెట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. 'బీఆర్‌ఎస్ పార్టీ ఇలాంటి బెదిరింపులకు భయపడబోదని మరోసారి స్పష్టం చేస్తున్నా. హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ప్రజల సమస్యలను జడ్పీ సమావేశం దృష్టికి తీసుకురావటమే కౌశిక్‌రెడ్డి చేసిన తప్పా? ప్రశ్నించే గొంతులను అక్రమ కేసులు బనాయించి మూయించడమేనా ప్రజాపాలన? కాంగ్రెస్ పాలనలో ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని పరిస్థితి. ప్రతీకార చర్యలు, అక్రమ కేసులను చట్టపరంగా ఎదుర్కొంటాం. ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తాం' అని వెల్లడించారు.

రాజకీయ ప్రేరేపిత కేసు ఒక్కటీ పెట్టలేదు

- కేసులపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- కేసులు పెడుతూనే.. లేదంటూ సన్నాయి నొక్కులు
- కొణతం దిలీప్, క్రిశాంక్, కౌశిక్‌రెడ్డి, కోవ లక్ష్మిపై పెట్టిన కేసులు రాజకీయ ప్రేరేపితం కావా..?
- ప్రశ్నించటమే పాపమన్నట్లు కాంగ్రెస్ సర్కారు తీరు

ఇప్పటివరకు ఎవరిపైనైనా రాజకీయ ప్రేరేపిత ఒక్క కేసైనా పెట్టినమా? ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలు చూస్తలేరా? తెలంగాణలో అలాంటివి ఏమైనా జరుగుతున్నాయా? ఎక్కడైనా, చిన్నదైనా చెదురుమదరు సంఘటనలు జరిగాయో చెప్పండి

- సీఎం రేవంత్‌రెడ్డి (ఇటీవల ఢిల్లీలో మీడియా సమావేశంలో)

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): రాజకీయ ప్రేరేపిత కేసులు ఒక్కటీ పెట్టలేదంటూనే.. బీఆర్‌ఎస్ నేతలపై రాజకీయ ప్రేరేపిత కేసులు పెడుతూ సీఎం రేవంత్ సన్నాయి నొక్కులు నొక్కటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించేవారిని అణచివేయటమే లక్ష్యంగా ప్రభుత్వం కక్షసాధింపులకు దిగుతున్నదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాన్ని ఎవరు ప్రశ్నించినా వారిపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నదని.. ఇందుకు పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతలపై పెట్టిన కేసులే ఉదాహరణ అని పలువురు అభిప్రాయపడుతున్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్‌ఎస్ నేతలు క్రిశాంక్, కొణతం దిలీప్‌పై ప్రభుత్వం ఇటీవల వరుస కేసులు నమోదు చేసింది. అయితే వీళ్లు నేరం చేశారని కాదు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే కేసులు నమోదయ్యాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఆర్టీసీ లోగోలు మార్పులు చేసిందంటూ ఓ లోగో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. అయితే దీన్ని గమనించిన కొణతం దిలీప్ అందులో కాకతీయ తోరణం లేదంటూ ట్యాగ్ చేశారు. దీంతో ప్రభుత్వాన్ని బద్నాం చేశారనే నెపంతో ఆయనపై ప్రభుత్వం కేసు పెట్టింది. కరెంట్ రావటం లేదంటూ ప్రశ్నించిన మరో బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్‌పైనా కేసు పెట్టి జైలుకు పంపించింది. తాజాగా కరీంనగర్ జడ్పీ సమావేశంలో పేద విద్యార్థులకు సంబంధించి చదువు, సౌకర్యాలపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించారనే నెపంతో ఆయనపై ప్రభుత్వం కేసు నమోదు చేసింది. మరో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపైనా ప్రభుత్వం కేసు నమోదు చేసింది. ఎమ్మెల్యేకు దక్కాల్సిన ప్రొటోకాల్‌పై ప్రశ్నించటమే ఆమె చేసిన నేరమైంది. వరుస ఘటనల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ తప్పులను ప్రశ్నించే గొంతులను అణచివేయడమే లక్ష్యంగా కేసులు పెట్టే ఆచారానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరతీసిందనే ఆరోపణలు వస్తున్నాయి.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు

మొదటిపేజీ తరువాయి...

స్పందించారని కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్ మీడియాకు తెలిపారు.

కొత్త ఆచారాన్ని తెరపైకి తెచ్చింది: గంగుల

ప్రజాసమస్యలపై ప్రశ్నించిన పాపానికి కేసు నమోదు చేయటం అనే కొత్త ఆచారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి తెచ్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మండిపడ్డారు. జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజాసమస్యలపై అధికారులను ప్రశ్నిస్తే కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. గతంలో ఇదే జడ్పీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా ఉన్న జీవన్‌రెడ్డి, శ్రీధర్‌బాబు అనేక ప్రజా సమస్యలపై చర్చించారని, అధికారులను నిలదీశారని, మరి వారిపై కేసులు నమోదు చేశారా? అని అడిగారు. 20 ఏండ్లుగా అసెంబ్లీలో ప్రజాసమస్యలపై మాట్లాడుతూ.. అందులో ఉన్నతాధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తున్నామని, ఎవరిపైనా కేసులు నమోదు చేయని విషయాన్ని గుర్తించాలని అన్నారు. ప్రజా సమస్యలపై నిలదీసినందుకు కేసులు పెట్టే సంస్కృతి కరీంనగర్‌లో కొత్తగా మొదలైందని, ఇది మంచిది కాదని స్పష్టం చేశారు. ప్రజలతో ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలుగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అధికారం తమకు ఉండదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన నియోజకవర్గంలోని సమస్యల గురించి అధికారులను అడిగితే పోలీసులు కేసు నమోదు చేయటం విచారకరమని అన్నారు. జడ్పీ ప్రాంగణంలో ఏది జరిగినా జడ్పీ అధ్యక్షుల అనుమతి తీసుకుని ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని, కానీ, ఇందుకు విరుద్ధంగా జరిగిందని వెల్లడించారు. తమ హక్కులకు కూడా భంగం కలగకుండా అందరినీ సమానంగా చూడాలని సీపీకి విజ్ఞప్తి చేశామని తెలిపారు. తాము సీఈవోపై ఇచ్చిన ఫిర్యాదుపైనా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి విచారణ జరపాలని సీపీని

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని వివరించారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపులు ఉండవని సీఎం రేవంత్ చెప్పిన మూడు రోజులకే కరీంనగర్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైందని, ఈ జిల్లాపై సీఎం దృష్టిసారించాలని గంగుల కోరారు. ప్రజా సమస్యలపై ఏ ఎమ్మెల్యే అయినా తన వద్దకు రావచ్చని సీఎం చెప్పారని, అదే ప్రజాసమస్యలపై జడ్పీలో మాట్లాడిన కౌశిక్‌రెడ్డిపై కక్ష సాధింపు ధోరణిలో కేసు నమోదు చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యేపై నమోదుచేసిన ఎఫ్‌ఐఆర్‌పై విచారణ జరిపి మూసివేయాలని అన్నారు.

ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే కేసులు: కౌశిక్‌రెడ్డి

జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై అధికారులను నిలదీసినందుకు తనపై కేసు నమోదు చేశారని పాడి కౌశిక్‌రెడ్డి వాపోయారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం పాఠశాలల్లో సౌకర్యాలు ఏర్పాటు చేశారా? వారికి పుస్తకాలు ఇచ్చారా? దుస్తులు ఇచ్చారా? భోజనాలు పెడుతున్నారా.. లేదా? అనే అంశాలపై ఎంఈవోలతో తన నియోజకవర్గంలో సమీక్ష నిర్వహిస్తే.. ఎమ్మెల్యే మీటింగ్‌కు ఎలా వెళ్తారంటూ మండల విద్యాధికారులకు డీఈవో నోటీసులు ఇవ్వడంతోపాటు వారిని రిటైన్ చేయటం బాధాకరమని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో గంగుల కమలాకర్ జిల్లా మంత్రిగా పాఠశాలలు ప్రారంభమవుతున్న ప్రతిసారి సమీక్ష నిర్వహించేవారని, ఇప్పుడున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు.. జిల్లాలో సమీక్షలు ఎందుకు పెట్టడం లేదు? అని ప్రశ్నించారు. బాధ్యతగల ఎమ్మెల్యేగా తాను సమీక్ష నిర్వహిస్తే మండల విద్యాధికారులపై చర్యలు తీసుకోవటం ఎంత వరకు సముచితం? అని నిలదీశారు. మంగళశారం జరిగిన జడ్పీ సమావేశంలో తాను ఇదే విషయాన్ని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని పరిస్థితిలో కలెక్టర్, డీఈవో జడ్పీ హాలు నుంచి వెళ్లిపోయారని తెలిపారు. హుజూరాబాద్‌లో దళితబంధు ఎందుకు ఇస్తలేరని, కేసీఆర్ కిట్స్ ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నిచానని, ఇలా ప్రశ్నించడం తప్పా? అని ప్రశ్నించారు. అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలు విని ఆగం కావొద్దని విజ్ఞప్తి చేశారు. గతంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలు నమ్మిన జమ్మికుంట తహసీల్దార్ జైలుకు వెళ్లారని గుర్తు చేశారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై కేసు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుతో కుమ్రంభీం ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్-కాంగ్రెస్ మధ్య ప్రొటోకాల్ వివాదం రోజురోజుకూ ముదురుతున్నది. ఎలాంటి ప్రొటోకాల్ లేకపోయినా ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రారంభోత్సవాలు చేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యేగా తనను పిలవటం లేదని మంత్రి సీతక్క, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుపై కోవ లక్ష్మి సోమవారం ఆరోపణలు చేశారు. ఆరోపణలను ఖండిస్తూ ఆమె దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేసి, ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుపై కోవ లక్ష్మి స్పందిస్తూ అధికార అహంకారంతో కాంగ్రెస్ నాయకులు పెట్టే కేసులకు భయపడేదే లేదని తెలిపారు.